మినీకథ.

# అద్దమా - అమ్మాయా

—ఆదూరి వెంకట సీతారామమూర్తి.

అక్కడ - అటు పల్లెమీద నాలుగాకు లెక్కువచదివి, అటు పట్నానికి రెండు మెట్లు తక్కువకున్న ఆ వూళ్ళో నడిబాజారు నాలుగురోడ్ల జంక్షన్‌లో మేకప్ వేసుకున్న ముసలి హీరోయిన్‌లా తయారైన ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో కలకలంబయల్దేరింది-

ఆ రోజు డిపార్ట్‌మెంట్ స్టోర్సుకు సంబంధించిన మేనేజరొకాయన హైద్రాబాద్ నించి విమానంలో వస్తున్నాడు- ఆ సందర్భంలో అక్కడి సేల్స్‌మన్ అంతా దిగులు గుండెల్తో వున్నారు-స్టోర్ మొత్తంమీద చూస్తే కస్టమర్స్‌కన్నా సేల్స్‌మెన్నే ఎక్కువున్నారు-ఆ యేడు లాభంకంటే నష్టాలే ఎక్కువున్నాయి--

నాలుగు రోడ్ల నడిబాజార్లో వున్న గవర్నమెంట్ స్టోర్స్‌లో జనం లేకపోడమేంటి అని ముక్కుల మీద వేళ్ళేసుకునే వాళ్ళు ఆ వూళ్ళో లేరు - అక్కడి వాళ్ళకు ఆ స్టోర్ హిస్టరీ తెల్సు - స్టోర్ పెట్టిన మొదట్లో ఆ హిస్టరీ- పేపర్లో కూడ పడింది-హిస్టరీ చింపేస్తే చిరిగి పోయేది కాదు గాబట్టి పేపర్లు చిరిగి పోయినా హిస్టరీ మిగిలిపోయింది-

అక్కడ పప్పుదినుసుల తూకాల్లో తేడా వుంటుందనీ, వూళ్ళో ఎక్కడా దొరకని ముక్క (పప్పు) దినుసులు అక్కడే లభ్యమౌతాయనీ, అక్కడ వస్తువుల ధరలు పెరగడమేగాని తగ్గడం వుండదని ఆ వూరి జనం అభిప్రాయం- వీటన్నిట్నీ మించి అందులోకి జొరబడ్డవాడెవడూ ఒక్క అయిదునిముషాలేనా నిలవలేని 'కండిషండ్ ఎయిర్ 'వాతావరణం దాన్ది-ఎండాకాలంలో అతివేడిగానూ వుంటుందందులో - వర్షాకాలంలో వర్షపాతాన్ని కొలవొచ్చు. అంచేత-అందులో పన్జేసే వారికంటే కష్టమర్సు ఏ రోజూ ఏ సమయంలోనూ ఎక్కువుండరు - అందుకే కలకలం! జనరల్ మేనేజరు గారు రానేవచ్చారు. వస్తూనే అల్మైరాల్లో వున్న సామగ్రిని కౌంటర్లలో వున్న సేల్స్‌మన్‌నీ చూశారు - చూసి ఏదో అవగతమైనట్లు తల పంకించాడు- పక్కనున్న అసిస్టెంటుతో యింగ్లీషులో ఏదో మాట్లాడేరు - నష్ట మొచ్చినంత మాత్రాన భయపడనక్కర్లేదన్నారు- స్టోర్స్ యింప్రూవ్ చేస్తే లాభాలు వాటంతటవే వస్తాయన్నారు- ఆతర్వాత అక్కడి మేనేజర్‌గారితోనూ అసిస్టెంటుతోనూ డిస్కస్‌చేసి కొన్ని సజషన్స్ యిచ్చారు.

ఆయన సలహాననుసరించి స్టోర్స్‌లో మార్పులు - జరగటంవల్ల ఆ తర్వాతి యేడాదిలో బాగా లాభా లొచ్చాయి-

ఆ స్టోర్స్ పూర్వంలాలేదు– గుమ్మం దాటిలో పలికి నాలుగడుగులు వేస్తే ఎడం వైపు నిలువెత్తు పెద్దఅద్దం; దానికెదురుగా కుడివైపు కౌంటర్‌లో ఒకఅందమైన అమ్మాయి– అకౌంటర్లో అబ్బాయిలకు కావల్సిన ఎన్నో సామాన్లు.

ఇప్పుడా డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో జనానికి లోట్లేదు.

---

## స్వార్థ సారధి

పాలానాదండం ములుగోల కేలబూని
స్వార్థ సారధి రథం నడుపుతున్నాడు
గోలగోలగా సమస్యల సమరక్షేత్రంలో
తూలి పడుతున్నాడు
నకిలీ ప్రజాస్వామ్యపు
సకిలింతల సోషలిజం గుఱ్ఱాలంతోటూ
హస్తిన సింహాసనంతో
కుస్తీ పడుతున్నాడు– మరోవైపు
దేశంలోని ఫాసిజాన్ని ఎదుర్కొనే
ఉద్దేశం మంటమండని
నరుడు నిరుత్తరుడై
ఉత్తరుడై అస్త్రసన్యాసంచేసి
ఉత్తచేతులతోనే తత్తరపడుతున్నాడు
నరుడు అధర్మాన్ని కాపాడిన పహనానికే మళ్ళీ
పురుడు పోసుకుంటున్నాడు
బూర్జువా తాతలనూ
గర్జించే ద్రోపదీభ్రాతలనూ చూచి
భూస్వాములైన తండ్రులనూ
కేపిటలిస్టు మామలనూ
లంచగొండి స్నేహితులనూ
వంచకాధికార బంధువులనూ
వంతపాడే గురుజనులనూ
సొంతగొంతులేని అనుజులనూ చూచి
వింత సానుభూతితో
అస్త్రసన్యాసంచేసిన నరుడే
తన ఆశయ లక్ష్యాల సరిహద్దు గీతపై నిలుచుని
అవినీతి ప్రాణంపై
బాణంసంధించ బోతున్నాడు

—చొప్పకట్ల చంద్రమౌళి.

---

## గాలానికి మింగలేది

చెమటోడ్చి, న్యాయంగా
పనిచేసేవాడి "శ్రమ"
నీట్లోమునిగిన "గాలం"లాటిది
కష్టానికి తగ్గ ప్రతిఫలాన్ని
అడిగితినే "నోరు"లేనంతకాలం
వాడికిమిగిలేది శ్రమే!
ఫలితం మాత్రం
ఎరచూపించి
కర్ర[illegible]నంచేసే
ఆపైవాడిదే

—నిట్టల ఫణిమిత్ర